ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 25 అక్టోబరు 2024

ఐసీడీఎస్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పరిధిలో పలు ఉద్యోగాలకు గురువారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ధర్మవరం, హిందూపురం బాలసదన్‌లలో 14 ఉద్యోగాలకు గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు. అభ్యర్థులకు ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో కంప్యూటర్ పరీక్ష నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరచిన 45 మందికి గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో జేసీ అభిషేక్‌కుమార్, సాంఘిక సంక్షేమ సాధికారత సంచాలకుడు శివరంగప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు ఐసీడీఎస్ పీడీ తెలిపారు.

డీఈఓగా కిష్టప్ప

కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా కిష్టప్ప నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఈఓగా పనిచేస్తున్న మీనాక్షి ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓగా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ప్రొద్దుటూరు డీవైఈఓగా పనిచేస్తున్న కిష్టప్ప ధర్మవరం డీవైఈఓగా బదిలీపై వచ్చారు. ఆయనకు జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆదర్శం

అత్తాకోడలు అంటే గుర్తొచ్చేది జగడమే. చాలా కుటుంబాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వారి మధ్య అంతర్యుద్ధం సాగుతూనే ఉంటుంది. పెనుకొండ మండలం మరువపల్లిలో మాత్రం అత్తను ప్రాణాపాయం నుంచి కాపాడి కోడలు చనిపోయింది. గ్రామానికి చెందిన రామాంజినమ్మ గురువారం దుస్తులు ఆరవేస్తుండగా ఇంటికి ఆనుకునే వెళ్లిన విద్యుత్ వైర్లను తాకింది. విద్యుత్ షాక్‌తో విలవిల్లాడుతున్న ఆమెను కోడలు అలివేలమ్మ కాపాడింది. వైర్లను కట్టెతో కొట్టి అత్త రామాంజినమ్మ ప్రాణాలు కాపాడింది. ఆమె గట్టిగా కొట్టడంతో వైర్లు రాపాడి చెంది, అలివేలమ్మకు షాక్ తగిలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. అత్తను కాపాడి.. తన ప్రాణాలు పోగొట్టుకున్న కోడలు అలివేలమ్మ ఆదర్శం.

వివరాలు 7వ పేజీలో..



అలివేలమ్మ ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

డీఆర్వోగా విజయసారథి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా విజయసారథిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఏపీఐఐసీ ల్యాండ్స్ ఓఎస్‌డీగా పనిచేస్తున్న ఈయనను డీఆర్వోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న కొండయ్యను జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు.

అయ్యో.. ఉష..!

- ఇంకా మంత్రి భ్రమల్లోనే వైసీపీ జిల్లా అధ్యక్షురాలు
- చిన్న విషయానికీ పోలీసులతో తగాదా
- హెచ్చరికలు.. ఆదేశాలు జారీ చేస్తున్న వైనం
- సొంత పార్టీ వారిదే తప్పు ఉన్నా.. వెనకేసుకొస్తున్న వైనం

'నవ్విపోదురుగాక.. నాకేటి' అన్నట్లుంది మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ తీరు. వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా.. ఆమె ఇంకా మంత్రి భ్రమల్లోనే ఉన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి చిన్న విషయానికీ, సొంత పార్టీ నాయకులదే తప్పు ఉన్నా.. హడావుడి చేస్తున్నారు. పోలీసు స్టేషన్‌లోనే రెచ్చిపోతున్నారు. పోలీసు అధికారులపై చిందులేస్తున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదేశాలిస్తున్నారు. అవసరమైతే పోలీసులకే సెక్షన్లు చెబుతున్నారు. ఆమె తీరుపట్ల పోలీసులు, ప్రజలే కాదు, సొంత పార్టీ నాయకులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- హిందూపురం, ఆంధ్రజ్యోతి

అధికారం పోయినా..

'ఉద్యోగులు.. మేం చెప్పింది చేయాలి, మేం అక్రమాలు చేస్తున్నా చూస్తూ ఉండాలి, మేం దౌర్జన్యం చేసినా స్పందించకూడదు. మేం తిట్టినా పడుండాలి. కాదంటే దాడులకు దిగుతాం, దౌర్జన్యాలు చేస్తాం'. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులపై గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రవర్తించిన తీరు ఇది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలవుతున్నా ఇప్పటికీ కొంతమంది వైసీపీ నాయకులు.. ఇంకా వారే అధికారంలో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇది వారి పార్టీ ఉనికి కోసమా.. గత ఐదేళ్లలో ప్రవర్తించిన తీరు మార్చుకోలేకపోతున్నారో అర్థంకాని పరిస్థితి. వైసీపీ నాయకులు గతంలో పోలీసులపైనే ఎదురుకేసులు పెట్టారు. పోలీసులను చూసి నేరగాళ్లు భయపడతారు. రాష్ట్రంలో గత వైసీపీ హయాంలో అందుకు విరుద్ధంగా పరిస్థితులు ఉండేవి. వైసీపీ నాయకుల అరాచకాలు చూసి పోలీసులే భయపడ్డారు. ఆ పార్టీ నాయకులు చేసిన వికృతచేష్టలు అన్నీ.. ఇన్నీ.. కావు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా పోలీసులను అదే తీరులో బెదిరించేలా వైసీపీకి చెందిన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వ్యవహరిస్తున్నారని పోలీసులే చెప్పుకోవడం గమనార్హం. ఆమె వైసీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన అనంతరం ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ, ఎలాంటి ఘటన జరిగినా ఆమె అక్కడికి చేరుకుని, వాస్తవాలను పక్కనబెట్టి పోలీసులను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఆమె తీరుపై పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉష తీరుకు నిదర్శనాలు కొన్ని..

- హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంటలో సెప్టెంబరు 10న వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరుపార్టీల వారికి గాయాలయ్యాయి. వైసీపీ నాయకులు చాకచక్యంగా టీడీపీ వారిపై దాడిచేసిన వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వైసీపీ నాయకులు దాడిచేసిన, రెచ్చగొట్టిన వీడియోలు లేవు. ఆ మరుసటిరోజే ఉషశ్రీ హిందూపురానికి చేరుకుని, ఆస్పత్రిలో వైసీపీ నాయకులను పరామర్శించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని, హల్‌చల్ చేశారు. కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పినా ఆమె వినకుండా దురుసుగా వ్యవహరించారు. తాను ఎవరినో తెలుసుకోవాలంటూ హెచ్చరించారు. పోలీసులు మాత్రం సంయమనం పాటించారు. దీంతో ఆమె రెచ్చిపోయి మాట్లాడారు. పోలీసులకే సెక్షన్లు చెప్పారు. దీంతో పోలీసులు ఒకింత అసహనానికి లోనయ్యారు.
- ఇటీవల చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచార బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ఆమె ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాసేపు హంగామా చేశారు. తమనే లోపలకు పంపరా అంటూ పోలీసులపై చిర్రుబుర్రులాడారు. ఆమె వ్యవహరించిన తీరు బాగాలేదంటూ పోలీసులే పెదవి విరిచారు.
- సోమందేపల్లి మండలంలో వైసీపీకి చెందిన ఓ నాయకుడి విషయంలో పోలీసు స్టేషన్ వద్ద ఉషశ్రీ హంగామా చేశారు. ఒకానొకదశలో ఆమె.. ప్రతిపక్ష హోదా మరిచి తానే మంత్రినన్న రీతిలో పోలీసులకే ఆదేశాలు జారీచేశారు. పోలీసులు కూడా వెనక్కి తగ్గలేదు. కార్యకర్తలతో కలిసి కొద్దిసేపు అక్కడ గొడవ సృష్టించేందుకు యత్నించారు. పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజాగా గోరంట్ల మండలంలో ఓ కేసుకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో ఉషశ్రీ వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. గ్రామానికి వెళ్లిన కానిస్టేబుల్ వాహన ప్లగ్ లాక్కుని, వైసీపీ నాయకుడు హంగామా సృష్టించాడు. అయినా అక్కడికి వెళ్లిన పోలీసులు సంయమనం పాటించారు. వైసీపీ నాయకులు తప్పు చేశారన్న విషయం మరచిపోయి స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐపై చిందులు తొక్కడం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. మరికొన్ని సందర్భాల్లో కూడా పోలీసులపై ఇలాగే వ్యవహరించినట్లు సమాచారం.



తప్పుచేసినా వెనకేసుకొస్తున్న వైనం

గత వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఆ పార్టీ నాయకులు ఇప్పుడు కూడా అలాగే ఉన్నారన్న భ్రమల్లో ఉన్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులు తప్పుచేసినా నిస్సిగ్గుగా వెనకేసుకురావడం గమనార్హం. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్లో వైసీపీ నాయకులదే తప్పు ఉన్నా.. అధికార పార్టీపై బురదజల్లడం ప్రతిపక్షం ఉనికి చాటుకోవడం కోసమేనన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత ఐదేళ్లలో నాయకులు ఎలా దౌర్జన్యం చేశారు.. ప్రస్తుతం కూడా ఏం చేస్తున్నారని ఆలోచించకపోవడం దురదృష్టకరం.

నేటికీ మంత్రిననే ఫీలింగ్

ఇటీవల ఉషశ్రీ జిల్లా అధ్యక్షురాలయ్యాక ఆమె వ్యవహరిస్తున్న తీరుపై సొంత పార్టీ నాయకులే చర్చించుకునే పరిస్థితులు తలెత్తాయి. ఎన్నికల అనంతరం బెంగళూరుకు పయనమైన ఆమె జిల్లా అధ్యక్షురాలిగా నియమించాక అప్పుడప్పుడు వస్తూ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీలో ఉన్నామని మరిచి మంత్రిలాగే అధికారులకు హుకుం జారీ చేస్తున్నట్లు సొంత పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా ఇటీవల తప్పుచేసిన వారిని వెనకేసుకురావడంపై పోలీసులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వద్దంటే వాన

అక్టోబరులో అధిక వర్షపాతం

కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అక్టోబరు నెలలో వానలు దంచికొట్టాయి. జిల్లాలో ముదిగుబ్బ, తలుపుల మండలాలు మినహా అంతటా అధిక వర్షపాతం నమోదైంది. గురువారం వరకు జిల్లావ్యాప్తంగా 270.8 మి.మీ., సగటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 94.3 మి.మీ, కాగా.. 176.5 మి.మీ, అధికంగా కురిసింది. ఈలెక్కన 187.1 శాతం అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు జిల్లా సగటు 711.2 మి.మీ, వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 450.8మి.మీ, కాగా.. 57.8 శాతం అధికంగా కురిసింది. 30 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా వరి 612, వేరుశనగ 580, మొక్కజొన్న 127, కంది 34 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

రహదారుల పనులు అడ్డుకుంటే చర్యలు

కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వేపనులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జాతీయ రహదారులు, రైల్వేపనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పనులను వేగవంతం చేసి, త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పరిహారం పంపిణీలో రైతులకు అన్యాయం కలగకుండా చూడాలన్నారు. కోర్టు కేసులపై దృష్టి సారించి, పరిష్కరించాలన్నారు. నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పంటల బీమా నమోదు వేగవంతం చేయండి

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంటలబీమా పథకానికి రైతుల పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ రాజశేఖర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టరు చేతన్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాలనీ, దీనిపై వారికి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. డిసెంబరు 15నాటికి నమోదు ప్రక్రియను ముగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖాధికారి శుభదాసు, ఎల్డీఎం రమణకుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం కోసం గొడవ

తాడిమర్రి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైన్స్ షాపు తెరిచే విషయమై మండల కేంద్రంలో గురువారం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పెద్దఎత్తున కూటమి నాయకులు గుమికూడి కొట్టుకునే దాకా వెళ్లారు. ఈ నెల 15వ తేదీన పుట్టపర్తిలో నిర్వహించిన లాటరీలో తాడిమర్రిలో వైన్స్‌షాపును గుంటూరుకు చెందిన గణేశ్ దక్కించుకున్నాడు. అప్పటి నుంచి స్థానిక కూటమి నేతలు ఆయనతో మంతనాలు సాగిస్తున్నారు. ఉన్నఫలంగా గురువారం గణేశ్‌తో తాము మాట్లాడుకున్నామనీ, షాపు ప్రారంభిస్తున్నామంటూ బీజేపీ ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి అనుచరులతో కలిసి రంగంలోకి దిగాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ష, బీసీ సెల్ నాయకుడు ఆత్మకూరు శీనివాసులు.. అనుచరులతో కలిసి తాడిమర్రికి చేరుకున్నారు. షాపులో మద్యం దించుతుండగా కేకలు వేశారు. దీంతో పూర్తిగా దించకుండానే వాహనం వెళ్లిపోయింది. తరువాత గోపాల్‌రెడ్డి వర్గీయులతోపాటు బీజేపీలోనే ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న మరోవర్గం తొడై దుకాణాన్ని ప్రారంభించేందుకు యత్నించారు. టీడీపీ నాయకులు వైన్స్ షాపునకు తాళం వేయగా.. అగ్రిమెంట్ చేసుకున్న బీజేపీ నాయకులు మరొకటి వేసి, రోడ్డెక్కారు. ఇరువర్గాలు దాడులు చేసుకునే పరిస్థితి తలెత్తింది. బీజేపీతో ఒప్పందం కుదుర్చుకున్న వాళ్లు తమతో కూడా చేసుకోవాలని టీడీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల వారిని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శ్యామరావు, ప్రభాకర్.. సిబ్బందితో వెనక్కిపంపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వైన్స్‌షాపు వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.



గుమికూడిన ఇరుపార్టీల నాయకులు

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న లక్ష్మీప్రియకళను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. లక్ష్మీప్రియకళకు చెక్ బౌన్స్ కేసులో కోర్టు జైలు శిక్ష విధించింది. దీంతో ఆమె రెడ్డిపల్లి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. విషయం తెలుసుకున్న విద్యాశాఖాధికారులు.. ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన వైసీపీ నాయకుడు

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు వైసీపీకి చెందిన సర్పంచ్ భర్త పట్టుబడ్డాడు. ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపిన వివరాల మేరకు.. పరిగి సర్పంచ్ భర్త శివశంకర్ కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పుట్టపర్తి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, పరిగి చెరువుకట్ట వద్ద పట్టుకున్నారు. ఒక మద్యం బాక్సుతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శివశంకర్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం కేసులో మూడేళ్ల జైలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం కేసులో చిన్న అంజినప్పకు మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు రొద్దం ఎస్ఐ నరేంద్ర గురువారం తెలిపారు. రొద్దం మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన చిన్న అంజినప్ప 2020 జూన్‌లో కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు విచారించిన పెనుకొండ మేజిస్ట్రేట్ బొజ్జప్ప మూడేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

పోలీసుల అదుపులో కాల్పుల కేసు నిందితులు

బత్తలపల్లి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో ఈ నెల 20న సంచలనం రేపిన కాల్పుల ఘటన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈనెల 20న నకిలీ బంగారు ముఠాపై తెలంగాణ ముఠా ఎయిర్ గన్స్‌తో కాల్పులు జరిపి, గ్రామస్థులను భయాందోళనలకు లోనుచేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం రెండు ముఠాలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. తెలంగాణకు ఒక బృందం, అన్నమయ్య జిల్లాకు మరో బృందం వెళ్లి గాలింపు చేపట్టాయి. తెలంగాణకు చెందిన 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అన్నమయ్య జిల్లా షికారిపాలెంకి చెందిన నకిలీ బంగారు ముఠా సభ్యుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తెలంగాణ ముఠాలో కీలకంగా వ్యవహరించినది ఒక యుట్యూబర్ అని సమాచారం. ఇతడు యూట్యూబ్ చానల్‌తోపాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే సైబర్ క్రైం ఇన్‌స్టిట్యూట్లు నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ఇతడితోపాటు 8మంది సఫారీ దుస్తుల్లో రామాపురం వచ్చి, నకిలీ బంగారు ముఠాపై ఎయిర్ గన్స్‌తో కాల్పులు జరిపారు. వారి వద్ద ఉన్న నకిలీ బంగారును దోచుకెళ్లినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

నిండుకుండ..



సీబీఆర్‌లో నీరు

వరుస వర్షాలకు తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిండుకుండలా మారింది. డ్యాం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 9.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.4 టీఎంసీల నిల్వ ఉంది. 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద కొనసాగితే డ్యాం గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాలైన దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి, లక్షుంపల్లి, గొడ్డుమర్రి, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- తాడిమర్రి, ఆంధ్రజ్యోతి

వరద బాధితులకు రూ.7 లక్షలు

ప్రైవేటు పాఠశాలల సాయం

హిందూపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు హిందూపురం జోన్ వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలు రూ.7 లక్షల సాయం అందించాయి. విద్యాసంస్థల నిర్వాహకులు రూ.5 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు బుధవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో అందించారు. హిందూపురంలోని పాంచజన్య పాఠశాల యాజమాన్యం మరో రూ.రెండు లక్షలు అందించింది. పురం ప్రైవేటు పాఠశాలల యజమానులను సీఎం చంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్, నందకుమార్, ప్రసాద్, మూర్తి, కరియన్న, గోవిందరాజులు, అకిబ్ పాల్గొన్నారు.




సీఎంకు చెక్కు అందజేస్తున్న దృశ్యం



తూర్పు.. పడమర..!

ముసిరిన చీకట్లు..
పడమటి సంధ్యవి కాదు
లేలేత పసిడి వెలుగులు..
తూరుపు దిక్కున కాదు
కనిపించేదంతా నిజం కాదు..!
ఒక్కోసారి..
చూపులు మోసగిస్తాయి..!
ఆలోచించి.. శోధించి..
నిజమేమిటో నిర్ధారించుకోవాలి..!

(అనంతపురం క్లాక్ టవర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై.. గురువారం ఉదయం.. ఏకకాలంలో తూర్పున మసక చీకటి.. పడమట వెండి వెలుగులు)



చిరునామా చిక్కులు...!

పథకాలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, బడికెళ్లినా, గుడికెళ్లినా ఎక్కడైనా ఆధార్ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మరణానికి, జననానికి ఇలా ప్రతి దానికి ఆధార్‌ను అనుసంధానం చేశారు. అయితే ఆధార్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఉడాయ్ నిబంధనల మేరకు పేర్ల మార్పు, పుట్టిన తేదీల మార్పు, చిరునామాల మార్పు, ఫొటో, బయోమెట్రిక్ తదితర అన్ని అంశాలకు అవకాశం కల్పించారు. అయితే ఏ మార్పు చేయాలన్నా సరైన ప్రూఫ్ తప్పనిసరి. అసలు చిక్కంతా అడ్రస్ మార్పుతోనే వచ్చింది. ఎవరైనా ఇళ్లు మారినా, ఊరు మారినా ఆధార్‌లో అడ్రస్ మార్చుకోవాలి. ఆ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం తప్పనిసరి చేశారు. అందులో పలు రకాల గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు చేయవచ్చని పేర్కొనప్పటికీ కేవలం తహసీల్దార్ సంతకాన్ని మాత్రమే అంగీకరిస్తుండంతో అసలు సమస్య మొదలయ్యింది. ఇతర అధికారులతో సంతకం చేయిస్తే ఆ దరఖాస్తులు తిరస్కరిస్తుండంతో లబ్ధిదారులకు పాట్లు తప్పడం లేదు.

- అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆంధ్రజ్యోతి

సంతకాలంటే జంకుతున్నారు..

ఆధార్‌లో సంతకాలు చేయాలంటే గెజిటెడ్ అధికారులు బెంబేలెత్తుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. గతంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్ల సంతకాలతో ఆధార్‌లో అడ్రస్‌లు మార్చుకున్న కొందరు వాటిని దుర్వినియోగం చేయడమే దీనికి ప్రధాన కారణం. ఆధార్‌లో చిరునామాలను మార్చుకొని కొందరు భూ కబ్జాలు చేసినట్లు చేసినట్లు సమాచారం. మరికొందరు డబుల్ రిజిస్ట్రేషన్లు తదితర అక్రమాలకు పాల్పడిన దాఖలాలూ ఉన్నాయి. దీంతో సంతకాలు పెట్టాలంటే అధికారులు జంకుతున్నారు. మరికొందరు అధికారులైతే సరైన ఆధారాలు, అడ్రస్ ఎందుకు మారుతున్నారు తదితర వివరాలపై ఆరా తీసి సంతకాలు చేస్తున్నారు.

ఆధార్‌లో అడ్రస్ మార్పునకు గెజిటెడ్ సంతకాలతో తిప్పలు



ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరిన కార్డుదారులు (ఫైల్)

జాబితాలో ఎందరో ఉన్నా..

నిబంధనల మేరకు అడ్రస్ మార్పు చేసుకునే దరఖాస్తులో గెజిటెడ్ అధికారుల జాబితాలో గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-ఏ, విలేజ్ పంచాయతీ హెడ్ ఆఫ్ ముకియా, గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-బీ, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మున్సిపల్ కౌన్సిలర్, తహసీల్దార్, హెడ్ ఆఫ్ రికజ్నైజ్డ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్, సూపరింటెండెంట్, వార్డెన్, మ్యాట్రన్, హెడ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రికజ్నైజ్డ్ షెల్టర్ హోమ్స్, ఆర్ఫనేజెస్, ఈపీఎఫ్ఓ ఆఫీసర్ల హోదాలను పొందుపరిచారు. అయితే వీటిలో ఏ ఒక్క అధికారి సంతకాన్ని చేయించుకొని ఆధార్ సెంటర్‌లో నమోదు చేయించినప్పటికీ... వారం, పదిరోజులకు అప్లికేషన్ తిరస్కరించినట్లు మొబైల్‌కు మెసేజ్ వస్తోంది. కేవలం తహసీల్దార్ సంతకాలతో కూడిన వాటికే అడ్రస్ మార్పులు జరుగుతుండంతో దరఖాస్తుదారులు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగక తప్పడం లేదు.

తహసీల్దార్ సంతకాలకే అంగీకారం..లేదంటే దరఖాస్తుల తిరస్కారం

లబ్ధిదారులకు తప్పని తిప్పలు

వార్డెన్‌తో సంతకం చేయించినా రిజెక్ట్ అయ్యింది...



ఆధార్ కార్డులో అడ్రసు మార్చుకోవాలని దరఖాస్తులో గెజిటెడ్ సైన్ ఆఫీసర్ల లిస్టులో వార్డెన్ ఆప్షన్ ఉంటే... నాకు తెలిసిన హాస్టల్ వార్డెన్‌తో సంతకం చేయించి అనంతపురం పోస్టాఫీసులో ఇచ్చాను. అయితే పదిరోజులకు అప్లికేషన్ రిజెక్ట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అధికారులను అడిగితే తహసీల్దార్‌తోనే సంతకం చేయిచాలంటున్నారు. ఇప్పటికైనా నిబంధలను మార్చి అందరు అధికారుల సంతకాలు చెల్లేలా అవకాశం కల్పించాలి. - శ్రీనివాసులు, ధర్మవరం

మా ఊళ్లో హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయించా...



నా ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఆధార్ సెంటర్‌కు వెళ్లాను. ఒక ఫారం ఇచ్చారు. అందులో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించుకొని రమ్మన్నారు. మా ఊళ్లో స్కూల్ హెచ్‌ఎంతో సంతకం పెట్టించుకుని వచ్చాను. అప్లై చేసిన వారం రోజులకు దరఖాస్తు తిరస్కరించినట్లుగా మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఇదేమని అడిగితే ఎమ్మార్వో సంతకం చేయించమని చెప్పారు. మా ఊళ్లోకి వెళ్లి అడిగితే వాళ్లు చేసేది లేదంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

- అరుణ్‌కుమార్, గార్లదిన్నె

నేటి నుంచి పశుగణన

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి 21వ భారత పశుగణన సర్వే ప్రారంభం కానుంది. ఇదివరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి సర్వే చేయాలని నిర్ణయించినా, కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. శుక్రవారం నుంచి నాలుగు నెలలపాటు సర్వే కొనసాగనుంది. పశుగణన సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 189 ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను నియమించారు. ప్రతి ఐదేళ్లకోమారు పశుగణన సర్వే జరుగుతోంది. శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పశుగణన సర్వే ప్రారంభిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. నాలుగు నెలలపాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి : డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జీఈఎ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టడానికి తగిన విధంగా నిధులు కేటాయించడం జరిగింది. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్ సూచించారు. ఎన్ఆర్‌జీఎస్ నిదుల వినియోగంపై ఉమ్మడి జిల్లా అటవీశాఖ సిబ్బందికి గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలోని సమావేశ భవనంలో వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, సబ్‌డీఎఫ్ఓ, అనంతపురం ఇంచార్జ్ డీఎఫ్ఓ ఆనంద్ హాజరై సిబ్బంది విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాలోని డీఆర్వోలు ఉసేనప్ప, చాప్లనాయక్, దీప, దామోదర్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్‌లో మట్టి తరలింపు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేంజ్ పరిధిలో శింగనమల బీట్‌లోని తరిమెల సమీపంలో అటవీశాఖ స్థలం నుంచి స్థానికులు గురువారం మట్టి తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక బీట్ అధికారి తేజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో స్పందించిన రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారులు అక్బర్, ప్రవీణ్‌కుమార్‌ను క్షేత్రస్థాయికి వెళ్లి వాహనాలను సీజ్ చేశారు. అపరాధ రుసుం చెల్లించిన అనంతరం వాటిని విడుదల చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జంగాలపల్లిలో వర్షాలకు దెబ్బ వేరుశనగ పంటను గురువారం సీపీఎం మండల కార్యదర్శి రామాంజినేయులు ఆధ్వర్యంలో పరిశీలించారు. అధిక వర్షాల నల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి పోతులయ్య, రైతులు నరేష్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్ద పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా మల్లోల

అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా మల్లోల నియమితులయ్యారు. గురువారం రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను, ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో మల్లోలను అనంతపురానికి నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో అనంతపురం ఆర్డీఓ గా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 17.4, తాడిపత్రి 11.2, రాప్తాడు 10.0, గార్లదిన్నె 9.4, వజ్రకరూరు 9.2, గుత్తి 8.0, గుంతకల్లు 7.2, యాడికి, పెద్దపప్పూరు 5.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.0మి.మీ. లోపు నమోదైంది.

గంటన్నరపాటు లిఫ్టులోనే రోగులు



అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమానికమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహణ అధ్వానంగా ఉందనడానికి గురువారం చోటు చేసుకున్న లిఫ్టు ఘటనే నిదర్శనం. చికిత్సకోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లిన నడవలేని ఐదుగురు రోగులు లిఫ్టు ఎక్కారు. అది మధ్యలోనే ఆగిపోయింది. దాదాపు గంటన్నరపాటు ఆ రోగులు లిఫ్టులోనే ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత మెకానిక్‌లు వచ్చి లిఫ్టు తాళంతో తెరవడంతో బయటకు వచ్చి ఊపిరి పీల్చుకున్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్టును తెరుస్తున్న ఎలక్ట్రిసిటీ సిబ్బంది, లిఫ్టులో ఇరుక్కుపోయిన పేషెంట్లు బయటకు వస్తున్న దృశ్యం

తుస్సుమన్న సమావేశం

అనంతపురం క్రైం, అక్టోబరు 24 : పారిశుధ్య కార్మికుల సమస్యలపై మున్సిపల్ యూనియన్ వర్కర్స్ నాయకులతో పాలకవర్గం, అధికారులు నిర్వహించిన సమావేశం తుస్సు మంది. మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య, కమిషనర్ నాగరాజుతో కలిసి సమావేశమయ్యారు. యూనియన్ నాయకులు వెంకటనారాయణ, ఏటీఎం నాగరాజు, నాగభూషణ సమస్యలు వివరించారు. వాటిపై పాలకవర్గం, అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవటంతో యూనియన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాన్ని అర్థాంతరంగా ముగించినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ గురువారం కొనసాగింది. ఇప్పటి దాకా 14835 మంది రైతులు 21009 క్వింటాళ్ల పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటి దాకా 20669 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు.

మున్సిపల్ స్థలాలను కాపాడండి

కమిషనర్‌కు సీపీఐ నేతల వినతి

అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ స్థలాలను కాపాడాలని సీపీఐ నాయకులు నగర కమిషనర్ నాగరాజును కోరారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ నాయకులు కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రూ. వంద కోట్ల విలువ చేసే ఏడెకరాల నగరపాలక సంస్థ స్థలం అన్యాక్రాంతం అవుతోందన్నారు. 2019-2024 మధ్య కాలంలో వైసీపీ నేతలు ఈ స్థలంలో అక్రమ కట్టడాలు కట్టారన్నారు. అలాగే ఖాజానగర్, శ్రీనగర్ కాలనీ తదితర చోట్ల కోట్ల విలువైన ఓపెన్ స్థలాలు సైతం కబ్జా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లి పీరా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్స్‌కు 'మాన్యువల్' సమస్య



ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం

భయోమెట్రిక్!



బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలకు మాన్యువల్ రిజిస్టర్ అందని ద్రాక్షలా మారింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలో బయోమెట్రిక్, మాన్యువల్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) రెండూ అమలు చేసేది. దీంతో బయోమెట్రిక్ సమస్య ఏర్పడిన సమయాల్లో మాన్యువల్ రిజిస్టర్ ఉండటంతో ఎక్కడా సమస్య లేకుండా సవ్యంగా సాగిపోయేది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణ ఎత్తేసి... బయోమెట్రిక్ మాత్రమే అమలు చేసింది. అయితే బయోమెట్రిక్ పనిచేయని సమయంలో వార్డెన్లు పలు ఇబ్బందులు పడేవారు. అప్పట్లో ఈ సమస్యను గమనించిన బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మాన్యువల్‌ను కొనసాగించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకున్నారు. అయితే ఎస్సీ వెల్ఫేర్‌లోని కొందరు అధికారులు దీన్ని నిర్లక్ష్యం చేశారు. దీంతో బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయని సమయంలో ఆ వార్డెన్ల బాధలు వర్ణనాతీతం. తాజాగా... పలు హాస్టళ్లలో బయోమెట్రిక్ పనిచేయకపోవడంతో దాదాపు పదుల సంఖ్యలో విద్యార్థులకు వార్డెన్లు సొంత ఖర్చులతోనే మెనూ అమలు చేయాల్సి వస్తోంది. ఆ సొమ్ము తమకు ఎవరు చెల్లిస్తారని... తమ జీతాన్ని సైతం ఖర్చు చేయాల్సి వస్తోందని ఆ వార్డెన్లు మండిపడుతున్నారు. ఇప్పటికే డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం... మాన్యువల్ లేకపోవడం... తదితర సమస్యలతో సతమతమవుతున్న తమకు ఈ బయోమెట్రిక్ మరో సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యం ఆయా సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మారడంతో మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణను మళ్లీ అమల్లోకి తీసుకొస్తారని ఎస్సీ సంక్షేమశాఖ వార్డెన్లు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మొరాయిస్తున్న బయోమెట్రిక్, ఐరిష్ ...

ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలు చేస్తున్నారు. వార్డెన్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలతోనే రిజిస్టర్ నమోదు చేస్తున్నారు. ఆ యంత్రాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అందజేసినవే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, ఐరిష్‌లు అందించిన పాపాన పోలేదు. కాగా ఎక్కువ కాలం కావడంతో ఆ యంత్రాలు మొరాయిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పలుమార్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలు ఇవ్వాలని మొర పెట్టుకున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా వాటిని తరచూ రిపేరీలు చేయించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆ యంత్రాల్లో బయోమెట్రిక్ పదుల సంఖ్యలో విద్యార్థులకు పడకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విద్యార్థులకు కాస్మెటిక్ తిప్పలు...

ఈ వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలను ప్రభుత్వమే అందిస్తోంది. 3 నుంచి 6వ తరగతి వరకు ఒక్కో బాలుడికి రూ. 125, బాలికకు రూ. 130, 7వ తరగతి నుంచి 10వ తరగతి బాలుడికి రూ. 150, బాలికకు రూ. 200, ఇంటర్మీడియట్.. ఆపై ఉన్న విద్యార్థికి రూ. 200, విద్యార్థినికి రూ. 250 ప్రకారం కాస్మెటిక్స్ చార్జీలను అందిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు నేరుగా వారి చేతికి నెలనెలా ఈ డబ్బులు అందించేది. దీంతో విద్యార్థులు తమకు కావాల్సిన కాస్మెటిక్స్‌ను నేరుగా కొనుగోలు చేసుకునేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నగదును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేలా నిర్ణయించింది. గడిచిన ఐదేళ్ల కాలంలో పలు హాస్టళ్లలోని విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో.. ఆరు నెలలు... మరికొన్ని చోట్ల సంవత్సరంపైగా కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉంచారు. ఇలా గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న కాస్మెటిక్స్ ఆన్‌లైన్ విధానంతో వందల సంఖ్యలో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

- వైసీపీ హయాంలో ఆ రిజిస్టర్ తొలగింపు
- బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయకపోవడంతో వార్డెన్ల ఇబ్బందులు
- వేలిముద్రలు పడని సమయంలో సొంత నిధులతో మెనూ అమలు
- కాస్మెటిక్స్ చార్జీలు ఆన్‌లైన్ చేయడంతో విద్యార్థులకూ తప్పనితిప్పలు
- ఇదీ జిల్లాలో ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల పరిస్థితి

రూ. వేలల్లో నష్టం ...

బయోమెట్రిక్, ఐరిస్ యంత్రాలు పనిచేయని సందర్భాల్లో వార్డెన్ల సమస్యలు అన్నీఇన్నీ కావు. ఒక్కో విద్యార్థికి రోజుకు 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 40, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 46, కాలేజీ ఒక్కో విద్యార్థికి రూ. 53 (భోజనం ఖర్చు)పైగానే వస్తుంది. ఈ లెక్కన ఒక రోజుకు 20 మంది విద్యార్థులకు బయోమెట్రిక్ పడకపోయినా... రూ. 1000లకుపైగా వార్డెన్ చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇలా రెండు.. మూడు రోజులు బయోమెట్రిక్ పనిచేయలేదంటే.. దాదాపు రూ. 3 నుంచి రూ. 4 వేలు ఆ వార్డెన్ నష్టపోవాల్సి వస్తోంది.

మాన్యువల్‌కు అనుమతి ఇవ్వాలి ...

ఎస్సీ హాస్టళ్లకు మాన్యువల్ లేకపోవడంతో వార్డెన్లు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు జరిగే సమయంలో అథెంటికేషన్ కాని సమయంలో వార్డెన్లు చేతి నుంచి ఖర్చులు పెట్టుకొని భోజనం పెట్టాల్సి వస్తోంది. మాన్యువల్ ఉంటే అటు విద్యార్థులు... ఇటు వార్డెన్లకు సమస్య ఉండదు. నెట్ సరిగ్గా లేకపోయినా.. సర్వర్ బిజీగా ఉన్నా.. సెలవుల్లో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి మళ్లీ హాస్టళ్లకు వచ్చినప్పుడు ఫింగర్ ప్రింట్లు పడవు. ఈ సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర అధికారులు మాన్యువల్‌ను అమలు చేయాలి.

- రామునాయక్, ఎస్సీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

రబీ నుంచి పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీ సీజన్ నుంచి పంటల బీమా వర్తింపు కోసం రైతులు నిర్దేశించిన ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి కలెక్టర్, జేసీ, జిల్లా వ్యవసాయాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది రబీ నుంచి రాబోవు సీజన్లల్లో రైతులు స్వయంగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే రైతులు తప్పని సరిగా బ్యాంక్‌ల ద్వారా ప్రీమియం కట్టాల న్నారు. మిగిలిన రైతులు సీఎస్‌సీ (మీసేవ) లేదా ఇన్సూరెన్స్ కంపెనీ లేదా ఎన్‌సీఐ ద్వారా ప్రీమి యం చెల్లించాలన్నారు. బీమా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, భూమి వివరాలు, వన్‌బీ, పంట సాగు ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్, ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ నెంబర్‌లను బ్యాంకు లేదా మీసేవ కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. జిల్లాలో దిగుబడి ఆధారిత పంటల బీమా కింద పప్పుశనగ పంటకు గ్రామ యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న పంటలను మండల యూనిట్‌గా ఇచ్చారన్నారు. వరి మినహా మిగతా పంటలకు డిసెంబరు 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాల న్నారు. వరికి డిసెంబర్ నెలాఖరుదాకా గడువు ఉందన్నారు. పప్పుశనగకు హెక్టారుకు రూ.1125, వరికి రూ.1575, జొన్నకు రూ.788, మొక్కజొన్నకు రూ.1313, వేరుశనగకు రూ.1200 ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ బీమా కింద టమోటాను ఎంపిక చేశారని తెలిపారు. టమోటాకు హెక్టారుకు రూ.4వేలు ప్రీమియం ప్రకారం డిసెంబరు 15లోగా చెల్లించాల న్నారు. ప్రీమియం చెల్లించిన రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రబీ పంటల బీమాపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహని కల్పించాలని ఆయన సూచించారు.

క్రైంకార్నర్

అత్తను కాపాడి.. కోడలు మృతి


అలివేలమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో చిక్కుకున్న అత్త ను కాపాడి, కోడలు మరణించింది. మండలంలోని మరువపల్లిలో విద్యుదాఘాతంతో చాకలి రామచంద్రప్ప భార్య అలివేలమ్మ (43) గురువారం మరణించింది. గ్రామస్థు లు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉతికిన గుడ్డలు అరబెట్టేందుకు అలివేలమ్మ అత్త రామాంజినమ్మ మిద్దెపైకి వెళ్లింది. దుస్తులు ఆరబెట్టే సమయంలో ఇంటికి ఆనుకునే వెళ్లిన విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు తగిలింది. షాక్ కొట్టడంతో ఆమె కేకలు పెట్టింది. అక్కడే ఉన్న ఆమె కోడలు అలివేలమ్మ కట్టెతో విద్యుత్ తీగలను కొట్టింది. రామాంజినమ్మ ప్రాణాలతో బయటపడింది. విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాపిడై, అలివేలమ్మ మీదకు రావడంతో ఆమెకు షాక్ తగిలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. రామాంజినమ్మ స్వల్పగాయాలతో బయటపడింది. రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అలివేలమ్మ మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కాటేసిన నిర్లక్ష్యం

మరువపల్లిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయనీ, మిద్దెలపై వెళ్లాయనీ, వాటిని మార్చాలని రెండు నెలల నుంచి గ్రామస్థులు.. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందని గ్రామస్థులు మండిపడ్డారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

విద్యుదాఘాతంలో అలివేలమ్మ మృతిచెందడంతో ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న బాధిత కుటుంబీకులను మంత్రి ఫోన్‌లో పరామర్శించారు. అధైర్యపడకండనీ, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ట్రాన్స్‌కో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మండలంలోని రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు.. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు.

ప్రభుత్వోద్యోగం రాలేదని ఆత్మహత్య

అనంతపురం క్రైం, అక్టోబరు 24: ప్రభుత్వ ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఓ జూనియర్ న్యాయవాది రుక్సానా(27) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రుష్యేంద్రబాబు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్న మండలం సిద్దరాంపురానికి చెందిన రుక్సానా తన ఇద్దరు చెల్లెళ్లు రేష్మా, కౌసర్‌తో కలిసి నగరంలోని పటేల్‌రోడ్డులో ఓ గది అద్దెకు తీసుకుని జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తోం ది. తల్లిదండ్రులు, తమ్ముడు సిద్దరాంపురంలో ఉన్నారు. కొంత కాలంగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. ఉద్యోగం రాకపోవడంతో అదే ఆలోచనతో ఉండేది. గురువారం మధ్యాహ్నం తన చెల్లెళ్లు బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెల్లుళ్లు ఇంటికి వచ్చి చూసి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో రిమాండ్

గార్లదిన్నె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పోక్సో, హత్యాయత్నం కేసులో గౌస్‌పీరా అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపిన మేరకు, మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన గౌస్‌పీరా వేధిస్తున్నాడు. వారం క్రితం బాలిక కుటుంబ సభ్యులు గ్రామస్థు లు మందలించారు. దీంతో గౌస్‌పీరా బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులపై కొడవలి తో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేర కు గౌస్‌పీరా పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

బడి భోజనం.. బాగుండాలని..

- మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు అడుగులు
- మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- ఎస్ఎంసీల సూచనలు పరిగణనలోకి..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని కొందరు విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అస్సలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. దుడ్డుబియ్యంతో అన్నం... రుచితో పాటు ఇష్టమైన కూరలే లేక పోవడంతో విద్యార్థులు.. బడి భోజనంపై అయిష్టత చూపుతున్నారు. దీనిపై అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా అన్నం తినేలా మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా మార్పులకు సిద్ధమైంది. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా సాగిన మధ్యాహ్న భోజన పథకం అమలును గాడిలో పెట్టేలా కూటమి సర్కారు కార్యాచరణ చేపట్టింది.

- ధర్మవరం, ఆంధ్రజ్యోతి


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో ప్రాథమిక 1563, ప్రాథమికోన్నత229, ఉన్నత పాఠశాలలు 315 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,42,540 మంది విద్యార్థులున్నారు. వీరిలో 20 శాతం మంది విద్యార్థులు వివిధ కారణాలతో బడిలో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాల గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల కలెక్టర్ స్థాయిలో సమీక్ష నిర్వహించింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులు, భోజనం చేసే వారి సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేశాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని, పథకంలో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది. వీటిలో ఏమేరకు అమలు చేస్తారోనన్న చర్చ సాగుతోంది.

ప్రత్యేక మెనూ ఇంకా అమలుకాలేదు

ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో మార్పులు చేయనుంది. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నవంబరులో మధ్యాహ్న భోజన మెనూపై ఏజెన్సీ నిర్వాహకులతో ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేసి, నాణ్యత వివరాలను పరిశీలించనున్నారు. ప్రస్తుతం మెనూ ఇంకా అమలు కాలేదు.

- రామకృష్ణ, విద్యాశాఖ ఏడీ

కమిటీల సూచనలు

- మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలి. పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్‌రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలికూడా తినడంలేదు. దీనిలో కూడా మార్పులుచేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావ నాణ్యతగా ఉండటం లేదు. ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలుగానీ, పాలుగానీ ఇవ్వాలి.
- అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, కోడిగుడ్లు సరఫరా చేయాలి.
- ఏజెన్సీలకు ఏ నెలకానెల బిల్లులు చెల్లించడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజెన్సీలకు అప్పుల బాధ తప్పుతుంది.

నాలుగేళ్లకే నాట్యం

భరతనాట్యంలో రాణిస్తున్న పురంవాసి

జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు

కళ


నృత్య భంగిమలో చంద్రబాను చతుర్వేది

హిందూపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుడి బుడి అడుగులు వేసే చిరు ప్రాయంలోనే ఆమె పాదం నర్తించింది. భరతనాట్యమే ఊపిరిగా పెరిగింది. అనతికాలంలోనే అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలిచ్చింది. ఎన్నో పతకాలు, బహుమతులు కైవసం చేసుకుని, భళా అనిపించింది. ఆమే హిందూపురం సదాశివనగర్‌కు చెందిన చంద్రబాను చతుర్వేది. ఉమ్మడి జిల్లాలో ఆమె పేరు తెలియని నాట్య కళాకారులు లేరంటే అతియోశక్తి కాదు. తల్లి మణరత్నకుమారి కోరిక మేరకు 2006లో నాలుగేళ్ల వయసులో భరతనాట్యం వైపు చంద్రబాను అడుగులు వేసింది. విజయవాడకు చెందిన ఘంటశాల పవన్‌కుమార్ వద్ద నాట్య పాఠాలు నేర్చుకుంది. తరువాత ఇండియాబుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కైవసం చేసుకుంది. 2019లో తెలంగాణ ప్రభుత్వం స్వర్ణనంది అవార్డుతో సత్కరించింది. విజయవాడలో నిర్వహించిన నాట్యపోటీల్లో ప్రతిభ చాటిన చతుర్వేదికి రాష్ట్ర ప్రభుత్వం యువరత్న అవార్డు ప్రదానం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా ఆమెను ఎంపిక చేశారు. ఎన్నో అవార్డులు, పతకాలు సాధించారు.

నాట్యాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలన్నదే లక్ష్యం



అంతరించిపోతున్న దేశ కళల్లో ఒకటైన భరతనాట్యాన్ని దేశవిదేశాల్లో ప్రదర్శించి, విశ్వవ్యాప్తం చేయాలన్నదే తన లక్ష్యమని చంద్రబాను చతుర్వేది తెలిపారు. ఆ దిశగా అభిజ్ఞ నృత్యాలయం స్థాపించారు. ఇప్పటి వరకు 76 మందికి నాట్యం నేర్పినట్లు ఆమె చెప్పారు. ఆన్‌లైన్‌లో విదేశాల వారికి సైతం నాట్యపాఠాలు చెబుతున్నట్లు ఆమె వెల్లడించారు.

విజయవాడకు కనెక్టివిటీ పెరుగుతుంది

రైల్వే డివిజనల్ మేనేజర్ విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిన రెండు భారీ ప్రాజెక్టులతో రాష్ట్రానికి, గుంతకల్లు రైల్వే డివిజన్‌కు మేలు కలుగుతుందని గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజరు విజయకుమార్ అన్నారు. రెండు భారీ ప్రాజెక్టుల విషయంపై రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లు డీఆర్ఎం చాంబర్ నుంచి రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రెండు రైల్వే ప్రాజెక్టుల వల్ల రాష్ట్ర రాజధాని అమరావతితో కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు. ఎర్రుపాలెం-నంబూరు మధ్య రూ.2,247 కోట్లతో 57 కి.మీ. లైన్ నిర్మాణం వల్ల విజయవాడ, గుంటూరు జిల్లాల మీదుగా హైదరాబాదు, చెన్నై, కలకత్తాకు అమరావతితో కనెక్టివిటీని పెరుగుతుందని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న డీఆర్ఎం

ఈ ప్రాజెక్టు కారణంగా ఉత్తర, దక్షిణ భారత దేశం మధ్య అనుసంధానం మెరుగుపడుతుందని అన్నారు. కృష్ణా నదిపై 3.2 కి.మీ. వంతెనను నిర్మిస్తారని అన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రయాణికుల చేరవే, సరుకు రవాణా మెరుగుపడుతుందని అన్నారు.

29 నుంచి ఉద్యోగుల క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు ఈనెల 29వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ షఫీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మహిళా, పురుషుల ఉద్యోగులకు 19 క్రీడల్లో రెండు రోజులపాటు పీటీసీ మైదానం, అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. 29న అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, యోగా, చెస్, టీటీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదే రోజు పీటీసీలో క్రికెట్, పుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. 30వ తేదీ ప్రసన్నాయపల్లి సమీపంలో స్విమ్మింగ్, ఆర్డీటీ స్టేడియంలో లాన్‌టెన్నిస్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నవంబరు 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఆయాశాఖల అధికారుల నుంచి ధృవీకరణ పత్రాలతో ఈనెల 28వతేదీలోపు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలోని తమ శాఖ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబరు 8712622577ను సంప్రదించాలని కోరారు.

చెరువులను పునఃపరిశీలించండి

అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

కనగానపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఆకస్మిక వరదలతో కనగానపల్లి చెరువు కట్ట తెగి పంటలు దెబ్బతిన్నాయని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న చెరువులన్నింటినీ పునః పరిశీలించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కనగానపల్లి చెరువు తెగి దెబ్బతిన్న పంటలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఒకే రోజు 198.20 మి.మీ. వర్షపాతం నమోదు కావడం, భారీ వరదల కారణంగా చెరువు కట్టతెగిందని అన్నారు. చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని అన్నారు.

శాశ్వత పనులు చేపట్టండి: ఎమ్మెల్యే

కనగానపల్లి చెరువుకట్ట శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రం అందజేశారు. అనుకోని వర్షాలతో అపారనష్టం జరిగిందని, వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆమె అన్నారు. కుంటిమద్ది చెరువుతోపాటు మరిన్ని చెరువులు దెబ్బతిన్నాయని, వాటికి మరమతులు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని విన్నవించారు.


వరదనీటికి దెబ్బ తిన్న వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే పరిటాల సునీత

వధువు మాయం

తండ్రి కన్నీటి పర్యంతం



పత్తికొండ, అక్టోబరు 24: పెళ్లికి కొన్ని గంటల ముందు వధువు మాయమైంది. ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో వధువు తండ్రి కన్నీటిపర్యంతమయ్యారు. తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తి తన కూతురును క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన యువకుడి ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయం చేసుకున్నాడు. వివాహం గురువారం జరగాల్సి ఉంది. వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కర్నూలు జిల్లా పత్తికొండలోని వివాహ వేదికకు ముందురోజే చేరుకున్నారు. పెద్ద తాంబూలం కార్యక్రమాలు బుధవారం రాత్రి పూర్తి చేశారు. ఆ తరువాత పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో వధువుల కనిపించకపోవడంతో కంగారుగా చుట్టుపక్కల వెతికారు. తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఆమె కల్యాణ వేది నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. పెళ్లి నిలిచిపోయింది. కూతురు పెళ్లి ఘనంగా నిర్వహించి, ఆమెకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలనుకున్న తండ్రి ఈ పరిణామంతో కుంగిపోయారు. ఉబికి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మా ర్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33 తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కె ట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపా రు. మార్కెట్‌కు గురువారం 1350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

సోషల్ మీడియా నేరాలపై స్పందించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్


మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అశ్లీలత, పరమత అసహనం, రెచ్చగొట్టే ధోరణులు, మోసాలపై ప్రభుత్వాలు స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐవైఎఫ్ పతాకాన్ని ఎగురవేసి.. రెండు రోజుల సోషల్ మీడియా వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆన్‌లైన్ మోసాలు పెచ్చుమీరుతున్నాయని, సోషల్ మీడియాలో రోజురోజుకూ అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టంగా నియంత్రించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే సామాజిక సమస్యలపై ఏఐవైఎఫ్ పోరాటాలు సాగిస్తుందని అన్నారు. ఏఐవైఎఫ్ 22వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ నాయకులు నాగరాయుడు, కత్తి రవి పాల్గొన్నారు.

త్రైమాసిక పన్నులను పరివాహన్ ద్వారా చెల్లించాలి

జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహనదారులు త్రైమాసిక పన్నులను వాహన్ పరివాహన్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు గురువారం ప్రకటనలో కోరారు. ఇదివరకు వాహనాల పన్నులను ఏపీ ఆర్టీఏ సిటిజన్ ఈ ప్రగతి వెబ్‌సైట్ ద్వారా చెల్లించేవారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రవాణాశాఖ సేవలను వాహన్ వెబ్‌సైట్‌కు మార్చడం జరిగిందన్నారు. వాహనదారులు తమ వాహనాల త్రైమాసిక పన్నులను వాహన్ పరివాహన్ వెబ్‌సైట్‌లో మాత్రమే కట్టాలని సూచించారు.

ఐదేళ్లుగా నష్టపోయాం.. గట్టెక్కించండి

సీఎంను కోరిన ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో తీవ్రంగా నష్టపోయామని, గట్టెక్కించాలని సీఎం చంద్రబాబునాయుడును ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు కోరారు. గురువారం అమరావతిలోకి సచివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పీ సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దనగౌడ్.. సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. ఐదేళ్లుగా డీఏ అరియర్స్ బకాయిలు రాకుండా జగన్ మోసం చేశారన్నారు. క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను తగ్గించి ఎంతో మంది పెన్షనర్లు నష్టపోయేలా చేశారని పేర్కొన్నారు. మెడికల్ బిల్లులు రీయంబర్స్‌మెంట్ రాకుండా చేజేతులా డబ్బులు పెట్టుకొని వైద్యం చేయించుకునేలా జగన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల మీకున్న చిత్తశుద్ధిపై తమకు నమ్మకముందన్నారు. దీపావళి పండుగకు డీఏలు ప్రకటించాలని కోరారు. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు బదులుగా హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం ప్రవేశపెట్టాలన్నారు. అన్ని తన దృష్టిలో ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చినట్లు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు తెలిపారు. అంతకుమునుపు వరద బాధితుల కోసం తమవంతు బాధ్యతగా రూ. 1.50 లక్షల చెక్కును సీఎంకు వారు అందజేశారు.


సీఎంకు చెక్కును అందజేస్తున్న నాయకులు

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని

అనంతపురం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సిబ్బందికి సూచించారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రీజియన్‌లోని అన్ని డిపోల డీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రయాణికులు చాలా వరకు శైవక్షేత్రాలకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తారని, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి బస్సు సర్వీసు పనితీరు, షెడ్యూల్ టైమింగ్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. బస్సులను సమయానుగుణంగా నడపాలని సూచించారు. సెక్టార్ వారీగా సర్వీసుల పనితీరును సమీక్షించి, బాగాలేని సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని కోరారు. సమీక్షలో డిప్యూటీ సీటీయం శ్రీలక్ష్మీ, అనంతపురం డీఎం నాగభూపాల్, జీఎల్ శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, బాలాజీ దయాల్, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎస్‌కే నాయక్, ఆర్‌పీ ప్రసాద్‌బాబు, ఎస్టీఐ నాగార్జున, ఏయం యఫ్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.


డీఎంలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్ఎం

క్లుప్తంగా

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా కదిరి డిపో నుంచి శైవక్షేత్రాలైన శ్రీశైలం, అరుణాచలం, కోటిలింగాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మైనోద్దీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాలకు కూడా ప్రయాణీకుల కోరిక మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్టు షాపులను నియంత్రించండి

నల్లమాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బెల్టు షాపులను నియంత్రించాలని సీపీఐ నాయకులు సీఐ నరేంద్రరెడ్డికి గురువారం వినతిపత్రం అందచేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ... గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శులు వెంటరమణ, చలపతి, నాయకులు గంగాద్రి ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని జిల్లా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి (ఏటీఏఓ) పవిత్ర గురువారం తనిఖీ చేశారు. మండలంలో జరిగే అబివృద్ధి కార్యక్రమాలు, నిధుల లావాదేవీలు, పంచాయతీల నిధులు.. తదితర వివరాలను ఆమె ఇన్‌చార్జి ఎంపీడీఓ నటరాజ్ వద్ద ఆరా తీశారు.

మనోబంధు సేవలు ప్రారంభం



ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మనోబంధు సేవలను గురువారం ప్రారంభించారు. ఎవ రైనా మానసిక బాధితులుంటే 94940 18465 నెంబర్‌కు ఫోన్ చేయా లని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ సత్యనిర్ధారణ్ సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

కదిరి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలచెరువు వద్ద చేపట్టిన ఉపాధి పనులను ఎంపీడీఓ పోలప్ప గురువారం పరిశీలించారు. కూలీల హాజరు పట్టికను తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డులో నమోదు చేయాలన్నారు. కూలి డబ్బులు సక్రమంగా ఖాతాలో పడుతున్నాయా లేదా అని ఆరా తీశారు.

వారంలోగా శ్మశాన వాటికకు స్థలం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ముదిగుబ్బ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామి తండా గ్రామంలో వారంలోగా శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిస్తామని ఆర్డీఓ మహేశ్ స్పష్టం చేశారు. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వెళ్లే 342 రహదారిని రామస్వామి తండా గ్రామంలో శ్మశాన వాటిక మీదుగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరో చోట శ్మశాన వాటికి ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిం చాలని ఆ గ్రామస్థులు ఆర్డీఓను విజ్ఞప్తి చేశారు. దీంతో గురువారం ఆయన ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌తో కలిసి గ్రామంలో రహదారిని పరిశీలించారు శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తా మన్నారు. అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మానానికి అడ్డుగా ఉన్న పెట్రోల్ బంక్‌ను తొలగించాలని దానిక యాజమాన్యానికి ఆర్డీఓ సూచించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



వెంకట అభిషిక్త్

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించిన అండర్-17 జిల్లాస్థాయి హాకీ పోటీల్లో స్థానిక రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థి గ్రంధే వెంకట అబిషిక్త్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నెల్లూరులో నవంబరు మూడో తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలో అనంతపురం జట్టు తరపున పాల్గొంటాడు. గురువారం ఆ విద్యార్థినిని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్ రూపారాజా కృష్ణ తదితరులు అభినందించారు.

5న అనంతపురంలో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

కదిరి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో నవంబరు 5న అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో పాల్గొని దాన్ని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గునివాండ్ల నాగేంద్రనాథ్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో చాలో అనంతపురం కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అనుకూలంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేసిన ప్రకటనలకు హర్షం వ్యక్తం చేస్తూ ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు నరసింహ, విశ్వనాథ, రామక్రిష్ణ, యల్లమరాజు, గంగాద్రి, రామచంద్ర, శివన్న, నాగరాజు పాల్గొన్నారు.

భూ రీసర్వే సభకు 135 వినతులు

నల్లమాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురమాలలో గురువారం భూసర్వే గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. ఈ సభలో రైతులనుంచి 135 వినతులు వచ్చాయన్నారు. వీటన్నింటిని రికార్డులు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

తనకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొడేళ్లగడ్డపల్లికి చెందిన ఆర్ మల్లికార్జున నాయుడు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించాడు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ గోపి, పోలీసులతో కలిసి ఆ గ్రామానికి గురువారం వెళ్లి మల్లికార్జున కుటుంబ సభ్యులు పరామర్శించారు. మల్లికార్జున సమాధి వద్దకెళ్ల నివాళ్లు అర్పించారు.



మల్లికార్జున సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ

ఏడాదికాకనే బీటలు!

- వైసీపీ అవినీతి లీలలు..
- రూ. రెండు కోట్లతో నిర్మాణం
- నాణ్యత లేకపోవడంతో అప్పుడే బీటలు
- నంబులపూలకుంట పీహెచ్‌సీ భవన నిర్మాణంలో డొల్లతనం







ఎన్పీకుంట ప్రభుత్వం ఆసుపత్రి, బీటలు వారిన గోడలు (ఇన్‌సెట్లో)

వైసీపీ పాలన మొత్తం మసి పూసి.. మారెడు కాయ చేసినట్లు సాగింది. భవన నిర్మాణాల్లో రంగులపై ఉన్న శ్రద్ధ... నాణ్యతపై చూపలేదు. అందుకు నంబుల పూలకుంటలోని పీహెచ్‌సీ భవనమే నిలువుటద్దం. ఆ భవనం చూస్తే రంగు .. రంగులతో అందంగా కనిపిస్తుందే తప్పా.. లోనికి వెళ్తేగానికి గాని అసలు అర్థం కాదు. పైన పటారం.. లోన లొటారం.. దీన్ని రూ. రెండు కోట్లతో నిర్మించి సంవత్సరం కూడా కాలేదు.. అప్పుడే ఈ భవనం గోడలు బీటలు వారాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తేమ అధికంగా కనిపిస్తోంది.

నంబులపూలకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించి.. ఏడాది కాకనే మొత్తం బీటలు బారాయి. గత వైసీపీ ప్రభుత్వం రూ. రెండు కోట్లతో ఈ ఆసుపత్రి భవనం, ప్రహరీని నిర్మించింది. వైద్యాధికారి, ఫార్మసిస్టు, మందులు భద్రపరిచే గదులను కూడా నాసిరకంగా నిర్మించడంతో గోడలు బీటలు బారి తేమపట్టాయి. ప్రస్తుత వర్షాలకు బీటల వద్ద తేమ అధికంగా కనిపిస్తోంది. బయట చూస్తే రంగులతో అందంగా కనిపిస్తున్నా... లోపల గదులన్నీ బీటలు బారి అధ్వానంగా కనిపిస్తున్నాయి. రంగులు పూసినా బీటలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నూతన భవనంలో గదులు ఇరుకుగా ఉండటంతో రోగులు చికిత్సలు పొందడానికి ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ అనాలోచిత నిర్ణయం

గతంలో ఆసుపత్రి భవనం, అక్కడే క్వాటర్స్ ఉండేవి. వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ వాహన డ్రైవర్ ఆ క్వాటర్స్‌లోనే నివాసముండేవారు. అత్యవసర సమయంలోనూ చికిత్సలు అందేవి. అయితే ఆ ఆస్పత్రి భవనం, క్వాటర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో నూతన ఆసుపత్రి నిర్మాణానికి దాతలు ఏకంగా ఐదు ఎకరాలను విరాళంగా ఇచ్చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వల్ల కేవలం 15 సెంట్లలో ఆస్పత్రి భవనాన్ని ఇరుకు... ఇరుకు గదులతో నిర్మించింది. అది కూడా నాసిరకంగా నిర్మించింది. క్వాటర్స్ నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బంది ప్రస్తుతం స్థానికంగా ఉండటంలేదు. రాత్రి సమయంలో స్టాఫ్ నర్సు, వాచ్‌మన్ మాత్రమే ఉంటున్నారు. రూ. రెండు కోట్లతో ప్రస్తుతం ఆస్పత్రిని నిర్మించినా.. అత్యవసర సమయాలల్లో ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నాణ్యత లోపం



గత వైసీపీ ప్రభుత్వం రూ. రెండు కోట్లు వెచ్చించి ఈ ఆసుపత్రిని కట్టింది. మొత్తం ఐదు ఎకరాల స్థలంలో కేవలం 15 సెంట్లలో ఈ భవనాన్ని నిర్మించారు. చిన్నచిన్న గదులతో నిర్మించడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నాణ్యత గురించి కూడా ఏ మాత్రం పట్టించుకోలేదు. నిర్మించి సంవత్సరం కూడా కాలేదు అప్పుడే గదులన్నీ బీటలు బారాయి.

\- నరసింహులు, వంకమద్ది

అందని వైద్య సేవలు



గతంలో ఆసుపత్రి సిబ్బందికి స్థానికంగా క్వాటర్సు ఉండేది. గతంలో డాక్టర్, వాహన డ్రైవర్, సిబ్బంది అందరూ స్థానికంగానే నివాసముండేవారు. అర్ధరాత్రి అయినా.. రోగులకు వైద్య సేవలు అందేవి. పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా అత్యవసర చికిత్సలు నిర్వహించేవారు. ప్రస్తుతం క్వాటర్స్ లేకపోవడంతో అత్యవసర వేళల్లో వైద్య సేవలు అందడం లేదు.

\- బాబ్‌జాన్, బీజేపీ నాయకుడు

రైల్వే బ్రిడ్జిని మూసివేయకండి



ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నల్లచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంజీవపల్లి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జిని మూసివేయరాదని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. కంకర మిషన్ నుంచి పలు లారీలు ఆ బ్రిడ్జి కింది నుంచి కంకర లోడ్‌తో వెళ్తుంటాయి. అవి ఓవర్ లోడ్‌తో వెళ్తుండటంతో ఆ బ్రిడ్జికి తగిలి.. దెబ్బతింటోందని ఓ అజ్ఞాత వ్యక్తి రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ అండర్ బ్రిడ్జిని మూసివేసేలా రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం రైల్వే అధికారులు, రైల్వే డీఎస్పీ కుమార్ ఆ బ్రిడ్జి మూసివేసే పనులను ప్రారంభించడానికి వచ్చారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ హర్షవర్ధనాయుడు, పలు గ్రామాల వారు వారిని అడ్డుకున్నారు. ఈ బ్రిడ్జికి అవతల అనేక మంది రైతుల పొలాలు ఉన్నాయని, మందాలవాండ్లపల్లి, వంకలపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇదే రహదారిని వివరించారు. ఈ బ్రిడ్జి మూసివేస్తే పొలాలతో పాటు పలు గ్రామాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందని వాపోయారు. ఈ మేరకు వారు ఆ అధికారులు వినతి పత్రం అందజేశారు. దీంతో ఆ రైల్వే అధికారులు వెనుతిరిగి వెళ్లారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎస్ఐ మగ్బుల్‌బాషా గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులందరూ వెళ్లి తహసీల్దార్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు.

బఫర్‌స్టాక్ సమస్య పరిష్కరించండి



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్న డీలర్ల వద్ద నిలువ ఉన్న బఫర్ స్టాక్ సమస్యను పరిష్కరించాలని డీలర్లు తహసీల్దార్ అనంతాచారిని, ఇతర అధికారులను విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీలర్లు మాట్లాడారు. గత ప్రభుత్వంలో పనిచేసిన డీలర్ల వద్ద బఫర్‌స్టాక్ క్వింటాళ్లలో ఉందని, ఇంతవరకు ఆ సమస్యను పరిష్కరించాలేదని అన్నారు. దీంతో ప్రస్తుత డీలర్లు ఇబ్బంది పడ్డాల్సి వస్తోందన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏప డీలర్ వద్ద ఎంత బఫర్ స్టాక్ ఉందో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ మున్వర్ బాషా, భరత్‌కుమార్‌రెడ్డి, డీలర్లు జయరామిరెడ్డి, బూదిలి ఓబులరెడ్డి, బాబు, సౌదీ నాగరాజు, ఎద్దుల సునీతమ్మ, జయచంద్రారెడ్డి, రామనాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తిరుపాల్ కుమారులతో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మదేవరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తిరుపాల్ కుటుంబానికి నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గురువారం ఆర్థిక సాయం అందించారు. తిరుపాల్ రెండు క్రితం మరణించాడు. అతని కుమారులు అనంతరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఫీజు విషయమై ఆ కుటుంబం ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ .. తిరుపాల్ కుమారులను అనంతపురంలోని తన స్వగృహానికి పిలుపించుకొని పరిస్థితులపై ఆరా తీశారు. వారి చదువుల నిమిత్తం రూ. 50 వేలు అందజేశారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొనిరావాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, నాయకులు బాలకృష్ణ, బాలచంద్ర పాల్గొన్నారు.



గంగపూజ చేస్తున్న గ్రామస్థులు

నిండిన అప్రాచెరువు

బత్తలపల్లి, అక్టోబరు 24(అంధ్రజ్యోతి) : మండలంలోని అప్రాచెరువు చెరువు నిండి గురువారం మరవ పారింది. మూడు సంవత్సరాల తర్వాత ఈ చెరువు నిండటంతో గ్రామస్థులు గంగ పూజ నిర్వహించారు. ఈ చెరువు కింద 600 ఎకరాల ఆయకట్టు ఉంది. 15 గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పశుగణన పోస్టర్లను విడుదల కలెక్టరు చేతన్

నేటి నుంచి పశుగణన

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో వెటర్నరీ జేడీ శుభదాసుతో కలసి పశుగణనపై వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ మాట్లాడారు. పశుగణనను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పాడిరైతులు లక్షలమంది ఉన్నారని, ప్రతిరైతు తమ పశువులను పశుగణనలో చేర్చాలని తెలిపారు. పశుగణనలో గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్ళు, పక్షులు తదితర 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించాలన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

కాంగ్రెస్ నేతల డిమాండ్

కదిరి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ ప్రాంతంలో వారు మాట్లాడుతూ... ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా.. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కదిరప్ప, పీఎస్ అహమ్మద్, అల్లాబక్ష, ఉపేంద్ర, రిజ్వానా, నాగరాజు, జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



దాతలు ఇచ్చిన కుర్చీల్లో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

తనకల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకటిమానుపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి కెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ రూ. 30 వేల విలువైన సామగ్రిని గురువారం అందజేసింది. చిన్నారులకు 30 బేబీ చెర్స్, కార్యకర్తలకు నాలుగు కుర్చీలు, రెండు జమఖాణాలను డివిజనల్ మేనేజర్ జగదీష్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, ఏరియా మేనేజర్ ఆదినారాయణ, బ్రాచ్ మేనేజర్ టీఎస్ పవన్‌కళ్యాణ్, బ్రాచ్ సిబ్బంది భరత్‌కుమార్, నవీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అనకాపల్లి భక్తులు రెండోరోజు గురువారం ప్రదర్శించిన సాయిపాదంలో సన్మార్గ వర్తనం నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. పురాణఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు, సత్యసాయి ప్రేమ అనన్యమంటూ భక్తిపాటలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రైతులను ఆదుకోండి..

కలెక్టర్‌కు పరిటాల శ్రీరామ్ వినతి

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):కుండపోత వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వినతిపత్రం అందజేశారు. గురువారం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను పరిటాల శ్రీరామ్‌తోపాటు టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకుడు భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు కలిసి, రైతు సమస్యను వివరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా వరి, వేరుశనగ, ద్రాక్ష తదితర పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోయారన్నారనను. పంట నష్టం అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం, బీమా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. తుంపర్తి వద్ద గృహ నిర్మాణాల కోసం సేకరించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

వర్షానికి కుప్పకూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద ఉప్పర హనుమంతు

సోమందేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామంలో ఉప్పర హనుమంతుకు చెందిన ఇల్లు గురువారం తెల్లవారుజామున కూలిపోయింది. బాధితుని కథనం మేరకు ఇంట్లో నిద్రపోయే సమయంలో ఏదో శబ్దాలు రావడంతో బయటకు పరుగులు తీశామన్నారు. ఇంతలో పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలిపోయిందన్నారు. దీంతో ఇంట్లో ఉన్న వస్తు సామాగ్రి, బియ్యం, రాగులు, బట్టలు, వస్తువులు ధ్వంసమయ్యాయన్నారు. సుమారు రూ.లక్ష దాకా ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రాణాపాయం తప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. భార్య రామాంజినమ్మ, కొడుకు సోమశేఖర్, కుమార్తె తేజతోపాటు తాను ప్రమాదం నుంచి బయటపడ్డామని తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

మాంస విక్రయదారులకు నోటీసులు

గోరంట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాంస విక్రయ కేంద్రాలనుంచి వెలువడే వ్యర్థాలను జనావాసాలో పడేసేవారిపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సాయిసంజయ్ గురువారం నోటీసులు జారీ చేశారు. మాంస వ్యర్థాలను ఎక్కబడితే అక్కడ పడేస్తూ ప్రజలకు అసౌకర్యంతోపాటు అనారోగ్యానికి గురిచేస్తున్నారన్నారు. చెత్త సేకరించే వాహనంవచ్చినప్పుడు పారిశుధ్య సిబ్బందికి వ్యర్థాలను అందించాలన్నారు. అలాగే పట్టణంలోని ఆరోగ్య చికిత్స కేంద్రాల వారువాడిపడేసిన సిరంజీలు, మెడిసిన్ వ్యర్థాలను సైతం పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని మౌనిక

పరిగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ధనాపురం విద్యార్థిని మౌనిక ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 21 నుంచి 23వరకు హిందూపురం మండల ముద్దిరెడ్డిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ధనాపురం ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని మౌనిక జాతీయస్థాయి అండర్-17 జట్టుకు ఎంపికైంది. మౌనిక ఎంపిక కావడంపై పీడీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

కమిటీ ఎంపిక



గ్రామైక్య సంఘం సభ్యులతో టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా పొదుపు సంఘాలను అభివృద్ధి చేసేందుకు గ్రామైక్య సమాఖ్య సంఘం గురువారం నగర పంచాయతీ కార్యాలయంలోని వెలుగు కార్యాలయంలో లీడర్ల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పట్టణ కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సమైక్య సంఘం అధ్యక్షురాలిగా అశ్వర్థమ్మ, కార్యదర్శిగా బాగ్యమ్మ, సహాయ కార్యదర్శిగా ఫక్రుద్దీన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఒక్కో సంఘానికి రూ.10లక్షల వడ్డీలేని రుణాలు అందిస్తున్నారని ఈనెల 31నుంచి సిలెండర్ బుక్ చేసుకున్నవారి ఖాతాలో నగదు బదిలీ అవుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న డీఎస్పీ

పెనుకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డివిజన్‌స్థాయి క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐలు పాల్గొన్నారు.

దేశాలన్నీ శాంతిమార్గంలో పయనించాలి

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు యుద్ధాలు విడనాడి శాంతి మార్గంలో పయనించాలని ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. గురువారం పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు కాంతారావు, హరిప్రసాద్, డా.శ్రీదేవి తదితరులు ప్రసంగించారు.

ప్రాచీన ఆలయాల వద్ద శ్రమదానం



శ్రమదానం చేసిన విద్యార్థులు

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం పట్టణంలోని ప్రాచీన దేవాలయాల వద్ద శ్రమదానంనిర్వహించారు. పీఓ డా. జయప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక రామభద్రాలయం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు ముళ్ల కంపలు చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల పరిరక్షణలో కళాశాల విద్యార్థులు భాగస్వాములు కావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామక్రిష్ణ, బక్కంపల్లి రామక్రిష్ణ, డా. రంగనాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రియల్టర్ల పాపం
ప్రజలకు శాపం



వెంకటగిరిపాళ్యం వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

● మోరీ కూల్చి.. ప్లాట్లు వేసిన వైనం ● పది సెంట్ల భూమి కబ్జా
● ఇబ్బందుల్లో వెంకటగిరి పాళ్యం ప్రజలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఏమైపోతే మాకేంటి మా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లాలి. రహదారిలో మోరీ ఉంటే మాకేంటి నష్టం అంటూ మోరీలు కూల్చి ప్లాట్లువేసి అమ్ముకుంటున్న వైనం పెనుకొండ మండలం కియాపరిశ్రమ సమీపంలో చోటుచేసుకుంటోంది. అమ్మవారిపల్లి జాతీయ రహదారి నుంచి వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రహదారిలో పంచాయతీరాజ్ అధికారులు ఏర్పాటు చేసిన కల్వర్టును రియల్టర్లు ధ్వంసం చేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై భారీగా నీరు చేరి రహదారిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటగిరిపాళ్యం వెళ్లే రహదారిలో సర్వేనంబరు 452-1ఎ లో 2.19 సెంట్ల భూమిని కొటాక్ కంపెనీ నుంచి కొందరు రియల్ వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన స్థలంలో అహుడా, పంచాయతీ అనుమతులు లేకుండా అనధికారికంగా లేఅవుట్లు వేశారు.



మోరీని ధ్వంసం చేసి నిర్మించిన ప్రహరీ

ఈ లేఅవుట్ వేయడంలో ఓ ప్రధానమైన మోరీని ధ్వంసంచేశారు. అమ్మవారిపల్లి నుంచి మక్కాజిపల్లి, వెంకటగిరిపాళ్యం, చంద్రగిరి, దుద్దేబండ, గ్రామాలకు వెళ్లే రహదారిలో కొన్నేళ్ల క్రితం పంచాయతీ అధికారులు ముందుచూపుగా భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా ఏర్పాటు చేసిన కల్వర్టులను నాశనం చేశారు. ముఖ్యంగా రహదారిపై 4అడుగుల వెడల్పుమేర సమీపంలోని వంకలోకి నీరు వెళ్లేందుకు మోరీ ఏర్పాటు చేశారు. కియా పరిశ్రమ ఏర్పాటుకాక ముందు అమ్మవారిపల్లి జాతీయ రహదారిపక్కన సర్వేనంబరు 452-1ఎలో 319ఎకరాల భూమిని కొటాక్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ భూమిలో 2.19సెంట్ల భూమిని రియల్టర్లకు విక్రయించారు. రియల్టర్లు కొనుగోలుచేసిన భూమిలో అనధికారికంగా లేఅవుట్ వేసి సెంటు రూ.5లక్షలకు విక్రయిస్తున్నారు. కాని ప్రజలు మాత్రం అమ్మవారిపల్లి జాతీయ రహదారి నుంచి వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రహదారిలో పంచాయతీరాజ్ అధికారులు ఏర్పాటుచేసిన కల్వర్టును ధ్వంసం చేసి ఆపై ప్లాట్లువేసి విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రహదారిలో మోకాలు లోతు నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు రియల్టర్లు ధ్వంసం చేసిన కల్వర్టును మరమ్మతు చేసి రహదారిపై నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అమ్మవారిపల్లి నుంచి వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రహదారిలో కల్వర్టు ధ్వంసం చేసిన సంగతి నాకు తెలియదు. దీనిపై త్వరలో విచారణ చేయిస్తా. ప్రజల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటా.

- తిరుమలరెడ్డి, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

చెరువు కాలువ గండ్లు పూడ్చివేత



కోడూరు చెరువు కాలువగండిని పూడ్చుతున్న దృశ్యం

చిలమత్తూరు, అక్టోబరు 24: మండలంలోని రెండు ప్రధాన పెద్ద చెరువులకు నీరు వెళ్లే కాలువలకు గురువారం మరమ్మతుచేసి గండ్లు పూడ్చివేశారు. ఇటీవల భారీవర్షాలు కురవడంతో కుషావతి నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో నదికి సబ్‌ఛానల్‌గా ఉన్న చిలమత్తూరు, కోడూరు చెరువుల కట్టకాలువలకు గండ్లు పడి నీరంతా వృథాగా పారుతోంది. ఈ విషయంపై అధికారులు స్పందించి రెండు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎట్టకేలకు గురువారం చిలమత్తూరు కట్టకాలువకు ఇసుక బస్తాలు వేసి పడిన గండిని పూడ్చారు. అదేవిధంగా కోడూరు చెరువు కాలువకు కూడా గండి పడి పెద్ద ఎత్తున నీరంతా వృథాగా పారుతుండటంతో సర్పంచ్ మురళీ స్పందించి పంచాయతీ సిబ్బందిని తీసుకెళ్లి గండికి పూర్తిగా మరమ్మతులు చేపట్టారు. దీంతో చెరువులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. రెండు చెరువులకు పడిన గండ్లు పూడ్చివేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూణ్ణాళ్ల ముచ్చట

● నాడు మంత్రుల రాకతో నాసిరకంగా రోడ్ల మరమ్మతులు
● నేడు పట్టణ వాసులకు శాపంగా మారిన వైనం



గుంతల మయంగా మారిన రహదారి

మడకశిరటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన నాసిరకం పనులు మూడునాళ్ల ముచ్చటగా మారాయి. వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో నాలుగు సంవత్సరాలపాటు మంత్రులు ఒకటి రెండు సార్లు మాత్రమే పర్యటించారు. ఎన్నికలు సమీపించడంతో అప్పటి అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్నారని హడావుడిగా పట్టణంతోపాటు హిందూపురం, మధుగిరి రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చే పని చేశారు. ఏడాది గడవక ముందే చేసిన పనులన్నీ నాసిరకంగా ఉండటంతో గతం కంటే ఎక్కువగా రహదారి గుంతల మయంగా మారింది. దీనిపై పట్టణ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం పావగడ, కళ్యాణదుర్గం, అనంతపురం, హిందూపురం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వందల వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణికులతోపాటు పట్టణ వాసులు సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చేసిన పనులపట్ల ప్రజలు సైతం పెదవి విరుస్తూ నాసిరకం పనులు చేయడం వల్లే ఇలా జరిగిందంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దాంతోపాటు తరచూ జరుగుతున్న ప్రమాదాలకు గుంతలు కారణమవుతున్నాయి. మధుగిరి సర్కిల్ నుండి వెటర్నరీ కళాశాల వరకు అరకిలో మేరకు గుంతలు అధికంగా ఉండటం వల్ల వర్షం వచ్చినపుడు అవి నీటి మడుగులను తలపిస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు తరచూ అందులో పడే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు చోటుచేసుకొని క్షతగాత్రులైన వారు కూడా ఉన్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరైనప్పటికీ జాతీయ రహదారుల సంస్థ పరిధిలో ఉన్నందువల్ల ప్రస్తుతం పనులను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మనోహర్ మృతి పార్టీకి తీరనిలోటు

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ మృతిపై నేతల సంతాపం
● పార్టీ అండగా ఉంటుందని కుటుంబీకులకు భరోసా



మనోహర్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మడకశిర టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ మృతి పార్టీకి తీరనిలోటని పట్టణంలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. మనోహర్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఉదయాన్నే వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె.పార్థసారథి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అంజినప్ప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణతోపాటు నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు అందరూ ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు పార్థీవ దేహాన్ని పాడెను మోశారు. చివరి వరకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, ఎంపీ, జిల్లా అధ్యక్షులు అందరూ అంత్యక్రియలు పూర్తి అయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

భారీ వర్షాలతో చెరువులకు జలకళ



నీటితో కళకళలాడుతున్న గుడిబండ చెరువు

గుడిబండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు ప్రవహించి చెరువులకు భారీగా నీరు చేరింది. మండలంలోని రాళ్లపల్లి, కరికెర, కొంకల్లు, గుడిబండ, సి.సి.గిరి, బైరేపల్లి, మోరుబాగల్ చెరువులకు నీరు చేరడంతో చెరువులు నీటితో కళకళ లాడుతున్నాయి. చెరువులు నిండటంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే పీడీ యాక్ట్



అక్రమ మద్యం విక్రేతలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మద్యం కొత్త పాలసీ అమలులోకి వచ్చిందని, దీంతో ఎవరైనా కర్నాటక మద్యం ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తే వారిపై పీడీయాక్ట్ కేసు పెడతామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య అన్నారు. గురువారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కర్నాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని కర్నాటక నుంచి మద్యం తీసుకురాకూడదని సీఐ హెచ్చరించారు. ఎవరైనా అలా చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

అమరాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలం తమ్మడేపల్లి గ్రామంలో శుక్రవారం వాల్మీకి కులస్తులు 12వ వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. శ్రీరాముడి ఘన చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి ఉత్సవాలను నేటి నుండి 27వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు హనుమంతరాయప్ప, నాగభూషణలు తెలిపారు.స్వామివారికి గంగాపూజతోపాటు ప్రతిష్ఠాపన కార్యక్రమం, మధ్యాహ్నం 2 గంటలకు గుండప్ప వారిచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుండి వాల్మీకి స్వామివారిని పూలతో అలంకరించి రథోత్సంలో మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు గగన్ మెలోడీ వారిచే ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కమిటీ వారు తెలిపారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మడకశిరటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.హరికృష్ణ తెలిపారు. 8 కంపెనీలలో పనులు చేసేందుకు ఉద్యోగ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుండి డిప్లొమా, ఐటీఐ పీజీ వరకు చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్

పెనుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని సాయిభవిత అండర్-14 హాకీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆ బాలిక నవంబర్ 3నుండి 5వరకు నెల్లూరులో జరిగే హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

సీసీ రోడ్లకు రూ.3కోట్ల నిధులు

అగళి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3కోట్లు నిధులు మంజూరైనట్లు ఏపీఓ శివన్న తెలిపారు. 13గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు అయ్యాయని పల్లె పండగ కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామాల్లో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

సబ్సిడీ డ్రిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మడకశిర రూరల్, అక్టోబరు 24 :(ఆంధ్రజ్యో)ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపి డివిజినల్ అధికారి నరసింహప్ప తెలిపారు. గురువారం మండలంలో ఆర్ అనంతపురం,సీ కోడిగేపల్లి, అయ్యావారిపల్లి, మరియు గుడిబండ మండలంలోని రైతులు డ్రిప్ పరికారలను ఆయా గ్రామాలకు వెళ్ళి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికారలను అందిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

గుడిబండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ(35) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ గురువారం తెలిపారు. రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రులలో చికిత్స చేయించుకొన్నా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి సమీపంలోని కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడన్నారు. మృతునికి వివాహం కాలేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

గుడిబండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను రైతులు తప్పక పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. మండలంలోని మోరుబాగల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు అధిక దిగుబడులు సాధించాలంటే అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను తప్పక పాటించాలన్నారు. వేరుశనగ, రాగి, కంది, తదితర పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మందులను పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు సాగుచేసిన కంది పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు వ్యవసాయ సాగుపై సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ నరసింహమూర్తి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఈని నియమించాలి

అగళి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అగళి మండలానికి విద్యుత్ ఏఈని నియమించాలని విద్యుత్ వినియోగదారులు రైతులు కోరుతున్నారు. గతంలో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేసిన శ్రీనివాసరావుచౌదరి అనారోగ్యంతో మృతి చెందాడని, అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సంవత్సర కాలంగా విద్యుత్ఏఈ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇన్‌చార్జిలను వేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఏఈని నియమించాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఏఈతోపాటు లైన్మెన్‌లను నియమించాలని కోరుతున్నారు.